


# కళ్లద్దాలు

దాట్ల నారాయణమూర్తిరాజు

చిన్న గులకరాయిని తీసుకుని కోనేట్లోకి విసిరాడు గోపాలం.

నిశ్శబ్దంగా తమలో తాము ముడుచుకుని కూర్చున్న అలలు ఒక్కసారి కదిలి వలయాలు వలయాలుగా విడిపోయి ఒడ్డుకి పారిపోతున్నాయి. ఆ కదుల్తున్న నీటిపొరలమీద పడుతున్న అస్తమయసూర్యుని కిరణాలు, నీటి కేన్వాస్‌మీద బంగారు గీతలు గీచినట్టుగా వున్నాయి.

—నాలుగు పక్కలా పాతికేసి చొప్పున మెట్లు, నీటి మధ్య తెల్లని గోపురంతో మంటపమూ, కోనేటికి ఆ పక్క ఆంజనేయస్వామి గుడీ, గుడి నానుకుని అరడజను కొబ్బరిచెట్లు, మెల్లగా వీచే రెమ్మల చప్పుళ్ళు, ఆ చెట్ల

క్రింద అల్లరిగా ఆడుకుంటున్న చిన్న పిల్లలు, నీళ్ళ కోసం వచ్చే ఆడాళ్ళ మాటలు అన్నీ వింటున్నాడు గోపాలం.

ఆ అందాలన్నీ చూస్తూ కోనేటి గట్టు మీద ఎంతసేపైనా కూర్చోగలడు గోపాలం. కానీ ఇవాళ అతని మనసేం బావోలేదు. చికాగ్గా చిరాగ్గా వుంది. ఎందుకో ఎవరిమీదో తెలియని కోపం. ఆ కోపంతో గుండెల్లో సుళ్ళు తిరుగుతున్న కసి. కలలో కన్పడ్డ సుందర వుద్యానవనం మళ్ళీ కలలోనే మాడి మసౌతున్నట్టుగా బాధ... బాధ...

ఆ బాధకు కారణం —

వూహించని పరిణామం.

అతడలా జరుగుతుందని ఎన్నడూ అనుకోలేదు. ఎన్ని ఆశలు పెంచుకున్నాడు. ఆ అమ్మాయిని తనదానినిగా చేసుకోవాలని ఎంత ప్రయత్నంచేసాడు. వెల్లువలా వస్తుందనుకున్న వెలుగు, తన కళ్ల కలుగుల్ని చీల్చుకుని వచ్చింది కటిక చీకటిగా —

—ఒక్కసారి తను 'షాక్' తిన్నాడు ఆ సాయత్రం పోస్టుమేన్ తెచ్చిన ఆ శుభలేఖ చూసి. అలా ఔతుందనికానీ అలా తన జీవితం అనుకోనివిధంగా మలుపు తిరుగుతుందనికానీ ఎన్నడూ వూహించలేదు గోపాలం.

జానకిని ఎంతలా ప్రేమించాడు తను!

—ఆ అమ్మాయి ఎంతో హాయిగా నవ్వే నవ్వుకు ఎంతగా మురిసిపోయాడు తను. ఆ విశాలమైన కళ్ళల్లోకి సూటిగా చూస్తూ ఎన్ని కలలు కన్నాడు తను.

కోనేట్లోకి విసిరిన రాయికి అలలు చెదిరినట్టు, గోపాలం మనసులో బాధ వేసిన రాయికి గతం అలలూ, కలలూ ఒక్కసారి కదలినయ్. ఆ కదలికకు మనసంతా వికలమై, తెలియని బాధతో అతని కళ్ళు ఒక్కసారి చెమ్మగిల్లాయి.

—చెమ్మగిల్లిన కళ్ళను తుడుచు కోవటానికి ఎడమచేత్తో కళ్ళకున్న కళ్ళద్దాలు తీసి కుడిచేత్తో రుమాలు తీసి కళ్ళు అద్దుకుని చుట్టూ చూసాడు కోనేట్లో నీళ్ళు, మెట్లు, నీటి మధ్య మంటపం, వూగుతున్న చెట్ల రెమ్మలు, ఆంజనేయ స్వామి గుడి అన్నీ మసకమసగ్గా కనిపించాయి.

బాధగా మళ్ళీ కళ్ళద్దాలు వెంటనే కళ్ళకు పెట్టేసుకున్నాడు గోపాలం.

—ఆ రోజు కాలేజీనుంచి ఇంటికొచ్చే సరికి చెల్లెలు చంద్రతో ఆ అమ్మాయి మాట్లాడుతూ కన్పించింది. తొలిసారిగా, అంతకుముందు ఎరగని అపురూప సౌందర్యాన్ని అప్పుడే చూసాడు గోపాలం.

—సన్నంగా, పొడవుగా, చాలా నాజూగ్గా, చేతికి సన్నని గాజులు, మెడలో ఒంటిపేట గొలుసు, చేతులూపుకుంటూ మాట్లాడేటప్పుడు పూసుపోక విచ్చల విడిగా తిరిగే కనుచూపులు, ఆ చూపుల్ని

ఎదుటివాడి గుండెల్లో పగగా గుచ్చు టానికి అంతంత పెద్దకళ్ళు చేసే ప్రయత్నం, ఇవేగాక ఇంత మించిన ఎన్నో రెట్లు పోగు పోసిన లావణ్యమంతా వెరశి...

ఆ అమ్మాయి జానకిని తయారు చేసారెవరో!

"జానకని ఎదురింటి జగన్నాథంగారి అమ్మాయి" ఆ అమ్మాయిని పరిచయం చేసింది చంద్ర.

లేత గులాబీ చెంపల మీదకు అకస్మాత్తుగా దాడిచేసిన ఎరుపుదనాన్ని దాచేసుకుంటూ, విశాలమైన ఆ కళ్ళ కొసళ్ళను వంచి చూస్తూ, బోల్డంత సిగ్గును ముఖంలో నింపుకుని "నమస్కారమండీ" అంది జానకి.

అలా గోపాలానికీ, జానకికీ పరిచయమైంది. ఆ పరిచయం జానకిలో ఏమోగాని గోపాలంలో మాత్రం నూతన అనుభూతుల్ని రేకెత్తించింది. ఎన్నో కోర్కెల్ని నింపి, ఎన్నో రాత్రులు కనురెప్పల్ని అంటసట పాల్జేసింది.

—కిలకిలా నవ్వేది. వచ్చిన దగ్గర్నుంచి వెళ్ళిపోయేవరకూ చనువుగా, గుక్క తిప్పుకోకుండా గలగలా మాట్లాడేది. ఎన్నోకబుర్లు చెప్పేది.

ఆ నవ్వేనవ్వు వేపు, మాట్లాడే ఆ హుషారైన మాటలవేపు, తను చెప్పే ప్రతివిషయానికీ ఆశ్చర్యపోయినపుడు లేత గులాబీరంగు బుగ్గలపై అందంగా పడే సొట్టలవేపు, ఆ కనురెప్పల విరుపుల వేపు చూస్తూ గడిపేవాడు గోపాలం.

"వస్తానండీ మాస్టారూ" అని జానకి వెళిపోతే ఇల్లంతా బోసిగా, మనసంతా వెలితిగా ఫీలయ్యేవాడు.

ఆ రోజు గోపాలానికి బాగా జ్ఞాపకం వుంది!

ఈజీచైర్‌లో కూర్చుని ఏదో పుస్తకం చదువుతూ, ఎదురింటివేపు చూపులు సారిస్తున్నాడు. కానీ మనసంతా జానకిపై వుంది. 'ఇవాళ వస్తుందా, రాదా' అని తన్లో తాను తర్జనభర్జనలు పడుతున్నాడు.

"ఏం మాస్టారూ ఇవాళ కాలేజీ శెలవా ఏవిటి" అని పలకరించి, సెలయేరులా చప్పుడు చేస్తూ వెళిపోయింది లోనికి.

జానకితో ఏదో మాట్లాడదామనుకున్నాడు. తన మనసులోని మాటల్ని చక్కగా పదిలపరిచి తన భావాన్ని స్పష్టంగా తెలియజేద్దామనుకున్నాడు. తనపై జానకి అభిప్రాయాన్ని కనుక్కుందామనుకున్నాడు.

ఎలా?

వంటగదిలో చంద్రతో జానకి మాట్లాడుతున్న మాటలు మెల్లగా వినబడుతున్నాయి. కొంత సేపటికి గదిలోంచి బయటికొస్తూ "సాయంత్రం ...మర్చిపోకు...చంద్రా...రా..."అని మళ్ళీ లోనికి కేకేసింది.

—గోపాలం కళ్ళద్దాలు సర్దుకుని కుర్చీలో కూర్చున్నాడు.

గుమ్మం దాటి, మెట్లు దిగిపోతూ, అరుగుమీద కుర్చీలో కూర్చున్న అతని వేపు ఎందుకో తలతిప్పి చూసింది జానకి. గోపాలం చెబ్దామనుకున్న మాటలు ఎందుకో గొంతుదాటి బైటికి రావడం మానేసాయి.

"ఏం మాస్టారూ అలా చూస్తున్నారు!" నోటికి చెయ్యి అడ్డు పెట్టుకుని నవ్వుతూ అంది జానకి.

"ఏం?చూడకూడదా"అటకాయించిన గొంతుమీద తిరగబడి మాటలు బయటికొచ్చేసాయ్.

"చూ డ ం డి...నాకేం..." అని ముందుకో అడుగువేసింది జానకి.

"జానకీ...చిన్నమాట.."ధైర్యంగా పిల్చేసాడు

ముందుకి పడుతున్న జలపాతంలాటి కురుల్ని వెనక్కి తోసుకుంటూ అతని కెదురుగా నిలబడింది జానకి.

అతను చెబ్దామనుకున్న మాటలు గుండెలో గింగుర్లు కొడుతూ చెల్లా చెదురుగా తిరుగుతున్నాయ్ తప్ప,గొంతు దాటి రాలేకపోతున్నాయి.

"ఎందుకూ పిలిచారు..." అంతంత విశాలమైన కళ్ళలోంచి సూటిగా చూపుల కోత కోస్తూ జానకి.

"వుత్తినే..." ఆ కోతను భరించలేక గోపాలం.

"అయితే వస్తాను..." సర్రున ముందుకి తిరిగి పోబోయింది. "ఆగండాగండి."ఆగి మళ్లీ ఆశ్చర్యంగా చూసింది.

"మీ నడక తెలుగు కథానికలా ఎంతో బావుంటుంది" బెరుగ్గా అన్నాడుగోపాలం.

"ఇది చెప్పడానికేనేవిటి పిల్చారు." ఆ కళ్ళ చివర పొగడ్తతో కల్సిన చిరుకోపం.

"అయితే న న్నో మా ట చెప్ప మంటారా..." జానకి కళ్ళు హుషారుతో తళుక్కున మెరిసాయి.

"చెప్పండి" కడివెడు సంతోషాన్ని నింపుకుని అన్నాడు గోపాలం.

"మీరు బావున్నారు కొలంబస్ లాగ ...కానీ మీ కా కళ్ళద్దాలు బావులేదు... నిజం...తీసేకూడదూ..." అ నే సి ముఖం నిండా చిలిపిదనాన్ని, వస్తున్న నవ్వును పంటి వెనక నొక్కి వెనక్కి తిరిగి చూడకుండా...వె ళి పో యి ం ది జానకి.

గోపాలం మనస్సు చివుక్కుమంది.

కళ్ళద్దాలు.

తనని చీకట్లోంచి వెలుగులోనికి నడిపించటానికి ప్రాణంలేని ఒక్క మిత్రువు... కళ్లద్దాలు ..., అవి లేకపోతే తను బ్రతగ్గలడా ? కళ్ళకు విడకుండా అంటిపెట్టుకున్న కళ్ళద్దాల్ని రెండు చేతులతో తీసి, పుస్తకంలోకి చూసాడు. పుస్తకంలో అక్షరాలన్నీ మసక మసగ్గా కనబడి వెక్కిరించాయి అకస్మాత్తుగా గోపాలం

ళ్ళంట కన్నీరు తిరిగింది. ఆ నీటి బిందువుల్ని తుడుచుకోవడానికి అతని కెందుకో భయమేసింది.

—ఆ రోజు డాబామీద పడుకున్నాడే గాని కళ్ళమీద కునుకు పట్టలేదు. కళ్ళ జోడులేని కళ్ళకు మసకమసగ్గా ఆకాశం, ఆకాశంలోని చుక్కలు అంతంత మాత్రంగానూ....క ని పి ం చా యి. మధ్యాహ్నం జానకి వేళాకోళానికన్న మాటలే మాటిమాటికీ గుర్తొచ్చి గుండెల్లో పొడుస్తున్నాయి. తనమీద తనకే జాలేసింది గోపాలానికి.

అయినా—

గోపాలం జానకిని ప్రేమించడం మానలేదు.

—ఓ రోజు సాయంత్రం చంద్ర చెప్పిన మాట నమ్మలేకపోయాడు గోపాలం.

"అవునన్నయ్యా, జగన్నాధంగారికి గు ం టూ రు ట్రాన్స్‌ఫరైంది. రేపే ప్రయాణమట..."

మర్నాడు జానకి మామూలుగా వచ్చి వెళ్తానని చెప్పిందే తప్ప అంతకు మించి మరొక్క మాట అన్లేదు. ఏ వై నా మ్లాడుతుందని, ఆ మాటల వెనక తన కోరిక వెల్లడించుకుంటుందని తనని విడిపోతున్నందుకు బాధపడి, తన కళ్లల్లో కళ్ళు కలిపి జా లి గా క న్నీ రు కారుస్తుందని...

ఇలా ఇలా వూహించుకున్నాడు గోపాలం.

గుంటూరు వెళిపోయాక రెండు మూడు వుత్తరాలొచ్చాయి. చంద్రకి రాసిన ప్రతి వుత్తరంలోనూ తనని మరీ మరీ అడిగేట్టు రాసేది జానకి. ఆ వుత్తరంలో రాసిన రాతలు చూసి జానకి తనని నిజంగా ప్రేమిస్తోందనే అనుకునేవాడు గోపాలం.

సాయంత్రం వచ్చిన ఆ పెళ్ళిలేఖ చూసి చాలా బాధపడ్డాడు గోపాలం. కళద్దాలు రుమాలుతో బాగా తుడుచుకుని చూసాడు. నిజమే జానకికి పెళ్ళి. చంద్రతో రమ్మని మరీ మరీ రాసారు జానకి తండ్రి జగన్నాధం.

తను వెళ్ళకుండా, చంద్రను పంపించకుండా కసితీర్చుకుందామనుకున్నాడు. కానీ ఎందుకో వెళ్ళాలనిపించింది. వెళ్ళాలి. ఆ వెధవ జానకిని చేసుకుంటున్నవాడు ఎలా వుంటాడో చూడాలి... అవును... చూడాలి.

రేప్పొద్దున్న ప్రయాణం.

— ఆలోచనలతో చెక్కలై పోతున్న తలను అదుపులో పెట్టుకోవటానికి కోనేటి గట్టుమీద చాలాసేపు గ డి పా డు గోపాలం.

పెళ్ళి పందిట్లో జానకిని చూసి అసూయ పడ్డాడు గోపాలం ఈర్ష్యచేత గోపాలం మనసు కుతకుతలాడింది. పెళ్ళికొడుకును చూసి మరీ మరీ మనసు పిసుక్కున్నాడు అతని

దగ్గర తనను తాను చూసుకుని మరీ చిన్నబోయాడు. ఆపచ్చని దబ్బపండులా వున్న ముఖందగ్గర తన ముఖం వికృతంగా కనిపించినట్టయింది. వెక్కిరించినట్టయింది.

—మరి చూడలేక ముహూర్తమయ్యాక వెంటనే వీధిలోకెళిపోదామనుకున్నాడు. జానకి తండ్రి జగన్నాధం 'ఏవోయ్, గోపాలం ఇలారా' అని పిల్చారు

'ఎందుకంటూ' ఆయన దగ్గర కెళ్ళాడు గోపాలం.

"అమ్మాయినీ, అబ్బాయినీ ఆశీర్వదించవూ" అని అన్నారాయన.

"నేనా" అన్నాడు గోలపాం.

ఒక్కొక్కరికీ నమస్కారాలు పెట్టుకుంటూ తనదగ్గర కొచ్చారు, జానకి దంపతులిద్దరూ. అప్పటివరకూ తల దించుకుని నిల్చున్నవాడల్లా తలెత్తి చూసాడు.

—గోపాలం వళ్ళు ఝల్లుమంది.

తనకిష్టమైన కళ్ళద్దాలు... పెళ్ళికొడుకు కళ్ళకి నల్లటి కళ్ళద్దాలు.

"అరర్రే....ఏమయింది...ఎలా జరిగింది...ఏవిటిది...ఏవిటీ ఘోరం... అతన్తోజానకి పెళ్ళి ఎలా జరిగిపోయింది? ఎలా...ఎలా" గోపాలం మనసులో ఒక్కసారి ఎన్నో భావాలు.

పెళ్ళికొడుకును ఎవరో చెయ్యి పట్టుకుని తీసికెళుతున్నారు. పెళ్ళికూతురు జానకి గదిలోకి వెళ్తూ తల తిప్పి గోపాలం వేపు చూసింది

నవ్వే తప్ప ఏడుపు తెలీని జానకి విశాలమైన కళ్ళనిండా కన్నీటి మెరుపు.

"జ్ఞాపకం వుందా మీకు, ఆ రోజు మిమ్మల్ని కళ్ళద్దాలు తీసేయమని, మీ బాధ తెల్సి కూడా అల్లరిపెట్టాను. అందుకే...అందుకే..." ఆ కన్నీటికే మాటలొస్తే జానకి బాధను అలా చెప్పేనేమో...

"నేను నిన్ను శపించలేదు జానకీ... శపించలేదు. నేను కనీసం ఆవేళ కించిత్తు కూడా బాధపడలేదు సుమా, బాధపడలేదు..." అని గోపాలం మూగగా బాధపడ్డాడు.

ఇలాగని జానకితో గోపాలం చెప్పడం ఎలాగ !

